ఊరటనిచ్చిన వర్షం

ప్రజాశక్తి -ఎస్ఆర్ పురం

నిప్పుల కుంపటిలాంటి వేడి ఉష్ణోగ్రత ఉక్కపోత నుంచి బుధవారం కురిసిన వర్షం ఉపశమనాన్ని కలిగించింది. గంట పాటు జోరుగా కురిసిన వర్షం వేడి నుంచి కాస్త ఊరటనిచ్చింది. ప్రజలను భయపెట్టిన వేడి వాతావరణం చల్లబడింది లోతట్టు ప్రాంతాలలో వర్షపు నీరు చేరింది రోడ్డుపై నీరు పారింది.

ప్రశాంతంగా ఓట్ల లెక్కింపు : కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

సార్వత్రిక ఎన్నికలు, ఓట్ల లెక్కింపు ప్రక్రియను సజావుగా శాంతియుత వాతావరణంలో నిర్వహించడానికి సహకరించిన అభ్యర్థులకు, రాజకీయపార్టీల ప్రతినిధులకు, అధికారులకు మీడియా వారందరికీ జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎస్.షన్మోహన్ బుధవారం ఒక ప్రకటనలో కతజ్ఞతలు తెలిపారు. సార్వత్రిక ఎన్నికల షెడ్యూలు విడుదలైనప్పటీ నుంచి ఓట్ల లెక్కింపు ప్రక్రియ ముగిసేంత వరకు జిల్లాకు సంబంధించి చిత్తూరు పార్లమెంటు, 7నియోజకవర్గాల పరిధిలో ప్రశాంతంగా పోలింగ్ ప్రక్రియను పూర్తిచేసి అదే స్పూర్తితో కౌంటింగ్ ప్రక్రియను కూడా విజయవంతంగా నిర్వహించడం జరిగిందన్నారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ పూర్తి అయిన అనంతరం రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎంలను సీలింగ్ చేసి సెంట్రల్ వేర్ హౌస్‌లో భద్రపరచడం జరుగుతుందని అన్నారు. సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో భాగస్వామ్యులైన ప్రతి ఒక్కరికి తన అభినందనలు తెలిపారు. ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా ఓట్ల లెక్కింపు ప్రక్రియకు సహకరించిన కౌంటింగ్ అబ్జర్వర్లకు, జిల్లా ఎస్పీకి, రిటర్నింగ్ అధికారులు, ఏఆర్ఓలు, రాజకీయపార్టీలు, సంస్థలు, రెవెన్యూ, పోలీసు శాఖ అధికారులు, జిల్లా అధికారులు, నోడల్ అధికారులు, సూపర్వైజర్లు, అసిస్టెంట్లు, మైక్రో అబ్జర్వర్లు, పోలీస్ అధికారులు, సిబ్బంది, కేంద్ర బలగాలు, అన్ని రకాల నిఘా స్క్వాడ్లు, సెక్టోరియల్ అధికారులు, జిల్లా స్థాయి నుంచి గ్రామస్థాయి వరకు అన్ని శాఖల అధికారులు, సిబ్బంది, ఇతర ఎన్నికల అధికారులు, తహశీల్దార్లు, మునిసిపల్ కమీషనర్లు, ఎంపీడిఓలు, మీడియాకు కలెక్టర్ ఎస్. షన్మోహన్ ధన్యవాదాలు తెలిపారు.

తెలుగోడు తలెత్తుకొనేలా..

టిడిపి విజయం

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

తెలుగోడు తలెత్తుకొనేలా రాష్ట్రంలో పార్లమెంట్ స్థానాల్లో తెలుగుదేశం విజయం సాధించిందని కేంద్రస్థాయిలో తెలుగుదేశం కీలకంగా వ్యవహరించనున్నట్లు చిత్తూరు ఎంఎల్ఏ గురజాల జగన్మోహన్ తెలిపారు. స్థానిక బీవీ రెడ్డి కాలనీలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో చంద్రబాబు నాయుడు కేంద్ర రాజకీయాల్లో తనదైన ముద్రవేశారని ప్రస్తుతం అదే పరిస్థితి నెలకొందన్నారు. రాష్ట్ర ప్రయోజనాలకు కాపాడుతూ పెండింగ్ ప్రాజెక్టుల పూర్తి చేయడంతో పాటు రాష్ట్రానికి ప్రత్యేకహోదా తీసుకొచ్చేందుకు చంద్రబాబు కృషి చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రజలు ఎంతో నమ్మకంతో తెలుగుదేశం పార్టీకి ఘన విజయం అందించారన్నారు. ఎన్నికల ముందు చిత్తూరు నియోజవర్గ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయనున్నట్లు తెలిపారు. తెలుదేశం జిల్లా అధ్యక్షులు సిఆర్ రాజన్ మాట్లాడుతూ జిల్లా ప్రజలు తెలుగుదేశం పార్టీకి ఘనవిజయం అందించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. జిల్లాలో ఆరు అసెంబ్లీ స్థానాలు, ఒక పార్లమెంట్ స్థానంలో విజయం సాధించిన జిల్లా ప్రజలకు కృతజ్ఞతులు తెలిపారు. ప్రజలు తమ పార్టీపై ఉంచిన నమ్మకాన్ని ఒమ్ము చేయకుండా ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయనున్నట్లు తెలిపారు.

చిత్తూరు ఎంఎల్ఏ గురజాల జగన్మోహన్

ప్రజలు అభివృద్ధిని కోరుకున్నారు..

చిత్తూరు ఎంపి దగ్గుమళ్ల ప్రసాద్‌రావు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

రాష్ట్ర ప్రజలు అభివృద్ధికి పట్టంకట్టారని చిత్తూరు ఎంపి దగ్గమళ్ల ప్రసాద్‌రావు అన్నారు. బుధవారం స్థానిక లక్ష్మీనగర్ కాలనీలోని ఎంపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల తెలుగుదేశం విజయం కోరుకుంటూ భారీ మెజార్టీతో అభ్యర్థులకు విజయం అందించారన్నారు. చిత్తూరు జిల్లాలో ఆరు నియోజకవర్గాల్లో టిడిపి అభ్యర్థులు ఘన విజయం సాధించారని, ఎంపిగా తనను రెండు లక్షల ఓట్లు మెజార్టీతో విజయం అందించిన జిల్లా ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేశారు. నారా చంద్రబాబు ఆదేశాల మేరకు చిత్తూరు అభివృద్ధికు కృషి చేయనున్నట్లు తెలిపారు. జిల్లాకు తాను ఇచ్చిన హామీలు పూర్తిస్థాయిలో అమలు చేసేందుకు కృషి చేయనున్నట్లు చెప్పారు. కూటమి అభ్యర్థుల విజయం కోసం తెలుగుదేశం, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు ఎంతో కష్టపడి పనిచేశారని తెలిపారు.

'ప్రజలు రాష్ట్రాభివృద్ధిని కోరుకున్నారు..'

రాష్ట్ర అభివద్ధిని కోరుకుంటూ ప్రజలు తెలుగుదేశం పార్టీకి భారీ మెజారిటీతో గెలిపించారని పెనుమూరు మాజీ జడ్పిటిసి రుద్రయ్య, యాదవ సాధికారిక జిల్లా అధ్యక్షులు శ్రీధర్ యాదవ్ అన్నారు. రెండు లక్షలపై చిలుకు మెజార్టీతో ఘనవిజయం సాధించిన చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావును స్థానిక లక్ష్మీనగర్ కాలనీలోని ఆయన నివాసంలో కలిసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎంపీని ఘనంగా సన్మానించారు. వారు మాట్లాడుతూ రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అనూహ్య విజయం సాధించి రాక్షస పాలనకు చమర గీతం పాడిందన్నారు. బడుగు బలహీన వర్గాల అభివద్ధి కోసం తెలుగుదేశం పార్టీ పనిచేయనున్నట్లు చెప్పారు. తెలుగుదేశం పార్టీకి భారీ మెజార్టీ అందించిన ఓటర్లకు కతజ్ఞతలు తెలియజేశారు. ఎంపీని సన్మానించిన వారిలో తెలుగుదేశం పార్టీ మహిళా నాయకురాలు ఇందిరా నాయకులు ఉన్నారు.

చిత్తూరు ఎంపి దగ్గుమళ్ల ప్రసాద్‌రావు

ఆగస్టుకి ఐదు లక్షల బీసీజీ వ్యాక్సినేషన్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ప్రభావతి దేవి ఆధ్వర్యంలో 'అడల్ట్ బీసీజి టీకా కార్యక్రమం'పై జిల్లాలోని వైద్యాధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. బిసిజి వ్యాక్సినేషన్ అచీవ్మెంట్‌ని ఇంప్రూవ్ చేయాలని, ఆగస్టు నెల నాటికి ఐదు లక్షల టార్గెట్ పూర్తి చేయాలన్నారు. ఎప్పటికప్పుడు యువిన్ ఆఫ్‌లో అప్లోడ్ చేయాలని తెలిపారు. అలాగే ఆర్‌సి హెచ్ సేవలను ఇంప్రూవ్ చేయాలని, ప్రతి పిహెచ్‌సి తప్పనిసరిగా డెలివరీస్‌ని కండక్ట్ చేయాలని, ఓపి సేవలందు ఈహెచ్ఆర్ ఇంప్రూవ్ చేసుకోవాలన్నారు. ఆశ లాగిన్ సర్వీసెస్‌ను ప్రతిరోజు ఆశ నోడల్ అధికారులు పర్యవేక్షించి ఎప్పటికప్పుడు ఇంప్రూవ్మెంట్ చూపించాలన్నారు. కార్యక్రమంలో అదనపు వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకట ప్రసాద్, ప్రోగ్రాం అధికారులు, పిహెచ్‌సి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

జూమ్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న డిఎం అండ్‌హెచ్‌ఓ ప్రభావతిదేవి

ల్యాబ్ టెక్నీషియన్లు గల్ల పరీక్షలు చేయాలి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్:

చిత్తూరు జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఓ.ప్రభావతి దేవి, అదనపు వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకట ప్రసాద్ సంయుక్తంగా బుధవారం ల్యాబ్ టెక్నీషియన్ల సమీక్ష సమావేశం నిర్వహించారు. డిఏంహెచ్ ఓ మాట్లాడుతూ జిల్లాలోని ల్యాబ్ టెక్నీషియన్లు తప్పనిసరిగా ప్రతివారం గల్ల పరీక్ష చేసి రిపోర్టులు పంపాలన్నారు. గల్ల పరీక్షల నమోదు చాలా తక్కువగా ఉందని, కావున రెండు వారాలు మించి ఉన్న దగ్గు కేసులకు ప్రతిఒక్కరికి తప్పనిసరిగా గల్ల పరీక్షించి పాజిటివ్ అయినట్లయితే ఆరు నెలల పాటు మందులు ఇవ్వాలని సూచించారు. అలాగే స్పర్శలేని మచ్చలు అనుమానంగా ఉన్న కేసులను వైద్యాధికారి దగ్గర నిర్ధారణ చేయించి ఉచిత మందులు పంపిణీ చేయాలన్నారు. ప్రతి గురువారం అడల్ట్ బిసిజి వ్యాక్సినేషన్ కార్యక్రమానికి ప్రతి ఒక్కరు సహకరించాలని, ప్రతి పీహెచ్సీలో యాక్టివ్, పాసివ్ స్లైడ్స్ (రక్త పరీక్షలు) వారి టార్గెట్ ప్రకారం తప్పనిసరి పూర్తిచేయాలని తెలిపారు. ల్యాబ్ పరీక్షలను ఎప్పటికప్పుడు అప్లోడ్ చేయాలి. ఏఎన్ఎంలు అందరికీ ఆర్డిటి కిడ్స్ ఇచ్చి అనుమానిత కేసులను పరీక్ష చేసి అవసరమైతే పిహెచ్‌సి రిఫర్ చేయాలని తెలిపాలి. ఇండ్ల పరిసరాలలో నీరు నిలవలేకుండా ఎప్పటికప్పుడు శుభ్రపరచుకోవాలని, ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడే తప్పక పాటించాలన్నారు. దోమతెరలు వాడాలని, పచ్చి వేపాకు పొగ వేసుకోవాలని తెలిపారు. వర్షాలు పడుతున్నందున కాచి వడగట్టిన నీరు తాగాలని, ఎవరికైనా జ్వరం లక్షణాలు కనిపిస్తే వెంటనే హెల్త్ వెల్నెస్ సెంటర్, ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రామ్, ఆరోగ్య కేంద్రంలోని రక్తపరీక్షలు చేయించుకోవాలని అన్నారు. మలేరియా, డెంగీ, చికెన్ గున్యా, ఫైలేరియా, మెదడు వాపు వ్యాధి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై, యాక్టివ్, పాసివ్ రక్తపరీక్షల నిర్వహణపై తగు సూచనలు తెలిపారు. కార్యక్రమంలో ఐడిఎస్‌పి డాక్టర్ అనిల్, సబ్ యూనిట్ అధికారులు శివసుబ్రహ్మణ్యం, ల్యాబ్ టెక్నీషియన్లు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న డిఎం అండ్ హెచ్‌ఓ ప్రభావతిదేవి

క్యాన్సర్‌పై ఇంటింటా సర్వే

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

చిత్తూరు జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఓ.ప్రభావతి దేవి, ఎన్‌సిడి టీం తిరుపతి ఎస్వీ మెడికల్ కాలేజ్‌లో నిర్వహించిన మూడు రోజుల క్యాన్సర్ స్క్రీనింగ్ శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ శిక్షణా కార్యక్రమంలో స్త్రీల గర్భ కోస నిపుణులు, డెంటల్ స్పెషలిస్టులు, జిల్లాలోని ఎన్సిడి టీంకు మూడు రోజుల శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈశిక్షణలో అన్ని రకాల మెలకువలను తెలుసుకొని జిల్లాలోని వైద్యాధికారులు, సిహెచ్ఓలు, ఏఎన్ఎంలకు వీరు శిక్షణ ఇచ్చి క్యాన్సర్‌పై ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. ఇంటింటి సర్వేలో అనుమానిత కేసులను మెడికల్ కాలేజ్‌కి రిఫర్ చేసి అక్కడ పూర్తి చికిత్స ఇస్తారన్నారు. ఈ కార్యక్రమాలను జిల్లా అధికారులు పర్యవేక్షించి క్యాన్సర్ లేని సమాజ స్థాపనకు కషి చేయడానికి ప్రభుత్వం ఈ కొత్త కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందన్నారు. ఈ స్క్రీనింగ్ కార్యక్రమాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

బుల్లెట్ సురేష్ రాజీనామా

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

మొదలియార్ కార్పొరేషన్ ఛైర్మన్ బుల్లెట్ సురేష్ తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు సాంఘీక సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శికి రాజీనామా లేఖను సమర్పించారు.

పవన్ కళ్యాణ్‌ను కలిసిన ఆరణి శ్రీనివాసులు



ప్రజాశక్తి -తిరుపతి సిటీ: జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌తో గెలిచిన ఎమ్మెల్యేలు బుధవారం భేటీ అయ్యారు. పవన్ కళ్యాణ్‌తో భేటీకి తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు సహా 20మంది ఎమ్మెల్యేలు హాజరై శుభాకాంక్షలు తెలిపారు. తిరుపతి ఎమ్మెల్యే గా గెలిచిన జనసేన అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు పవన్ కళ్యాణ్ కు కతజ్ఞతలు తెలియజేశారు. తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం పవన్ కళ్యాణ్‌కు అందచేశారు. భారీ మెజార్టీతో గెలిచావ్ అంటూ ఆరణి శ్రీనివాసులు భుజం తట్టి పవన్ కళ్యాణ్ అభినందించారు. అనంతరం జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులతో పాటు ఆరణి మధన్, ఆరణి జగన్ పాల్గొన్నారు.

వడగండ్ల వర్షం... మామిడి రైతుకు నష్టం

ప్రజాశక్తి -బాలాయపల్లి

మండలంలోని అలిమిలి, వెంకటరెడ్డిపల్లి, అంబలపూడి, నిండలి గ్రామాల్లో బుధవారం మధ్యాహ్నం భారీ ఈదురుగాలులతో కూడిన వడగండ్ల వర్షం కురిసింది. ఈదురుగాలులకు మామిడి కాయలు నేల రాలాయి. వడగండ్లు పడడంతో పశువుల రేకుల షెడ్లు దెబ్బతిన్నాయి. అకాల వడగండ్ల వానతో అపార నష్టం వాటిల్లిందని మామిడి తోటలు కౌలుకు తీసుకున్న రైతులు వాపోయారు.

టి 'డి' ఆర్ బాండ్లు

వైసిపి కొంపముంచి.. జనసేనకు 'జై' అనిపించి..

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

ఏదైతే అభివృద్ధి చేశామని సిట్టింగ్ ఎంఎల్ఏ భూమన కరుణాకరరెడ్డి, వైసిపి అభ్యర్థి భూమన అభినయ్‌రెడ్డి చెబుతున్నారో... ఓ రకంగా ఆ అభివృద్ధి మాటున అక్రమాల టిడిఆర్ బాండ్లు ఆ పార్టీ కొంప ముంచాయని చర్చ నడుస్తోంది. ఇవే టిడిఆర్ బాండ్లను జనసేన తరపున గెలుపొందిన ఆరణి శ్రీనివాసులు బాగా ఉపయోగించుకున్నారు. తొలుత ఆరణి శ్రీనివాసులు చిత్తూరు నుంచి వలస వచ్చారని వ్యతిరేకించినా, 'నాన్ లోకల్' అని ముద్ర వేసినా అందరినీ ఏకతాటిపైకి తెచ్చి, వైసిపి ఐదేళ్ల పాలనలో అవినీతి అక్రమాలను ప్రచారాస్త్రాలుగా సంధించడంలో సక్సెస్ అయ్యారు. భూకబ్జాలు, గంజాయి విచ్చలవిడి అమ్మకాలు వైసిపి కొంపముంచాయి. ముఖ్యంగా మాస్టర్‌ప్లాన్ రోడ్ల పేరుతో పెద్దఎత్తున 18 రోడ్లు వేయాలని కౌన్సిల్లో భూమన అభినయ్‌రెడ్డి చేసిన తీర్మానాన్ని ఆమోదించారు. అందులో 12 రోడ్లకు ప్రీలెఫ్ట్ రోడ్లు వేయాలని నిర్ణయించారు. అయితే ఈ మాస్టర్‌ప్లాన్ రోడ్లు వేసేటపుడు భూ యజమానులతో సంప్రదించకుండా బలవంతంగా ఇష్టానుసారంగా భూసేకరణ చేశారన్న ఆరోపణలున్నాయి. భూములు కోల్పోయిన బాధితులు తమకు న్యాయం చేయాలని వేడుకున్నా ఇటు అధికారులు, అటు ప్రజాప్రతినిధులు పట్టించుకోలేదు. కొంతమంది కోర్టును సైతం ఆశ్రయించారు. టిడిఆర్ బాండ్ల జారీలోనే అవినీతి భారీగా జరిగిందని టిడిపి ఆరోపణ. చిన్నాచితక స్థలాలు ఉన్న భూ యజమానులు తమ స్థలాలు పోయాయని, నష్టపరిహారం ఇవ్వాలని కోరినా పట్టించుకోకుండా, అవే టిడిఆర్ బాండ్లను వైసిపి నేతలు తీసుకుని, అధిక ధరలకు విక్రయించారన్న ఆరోపణలు ఉన్నాయి.

నగరంలో దాదాపు 12 మాస్టర్‌ప్లాన్ రోడ్ల పరిధిలో 50 మంది పైగా కోర్టును ఆశ్రయించారు. ఈ రహదారుల నిర్మాణం పేరుతో అనేక కట్టడాలను కూల్చేశారు. వాటికీ నష్టపరిహారం ఇవ్వలేదు. టిడిఆర్ బాండ్లు ఇస్తామని చెప్పిన వారికీ ఇవ్వలేదు. మున్సిపల్ స్కూళ్లు, ప్రభుత్వ పాఠశాలలను కూల్చేశారు. ఈ మాస్టర్ ప్లాన్ రోడ్లకు సంబంధించి తిరుపతి కార్పొరేషన్ సంబంధించిన 50 కోట్ల రూపాయలు బ్యాంకులో డిపాజిట్ ఉంటే వాటిని తనఖా పెట్టి రుణం తీసుకున్నారని తెలుస్తోంది. మిగిలిన రోడ్లకు నిధులు లేకపోవడం వల్ల ఆగిపోయాయి. ఎన్నికల నోటిఫికేషన్ రాకముందు దాదాపు 250 మందికి టిడిఆర్ బాండ్లు ఇవ్వాలని వైసిపి నేతలు భావించారు. అయితే రాష్ట్రవ్యాప్తంగా ఆరోపణలు రావడంతో ఇవ్వలేదు. దీంతో బాధితులు టిడిఆర్ బాండ్లు ఇస్తారో లేదో అనే సందేహంతో కుమిలిపోతున్నారు. ప్రస్తుతం ప్రభుత్వం మారడంతో టిడిఆర్ బాండ్లు ఎప్పటిలోపు ఇస్తారో అనే ఆశతో బాధితులు ఎదురుచూస్తున్నారు. తిరుపతి ఎంఎల్ఏగా గెలుపొందిన ఆరణి శ్రీనివాసులు టిడిఆర్ బాండ్లను ఇప్పించాలని కోరుతున్నారు.

'జె' ట్యాక్స్‌లు రద్దు చేయండి : బాధితులు

వైసిపి కార్పొరేటర్ల ఆగడాలకు చెక్ పెట్టాలని తిరుపతి ఎంఎల్ఏ ఆరణి శ్రీనివాసులును బాధితులు కోరుతున్నారు. నగరంలో 50 డివిజన్లలో వైసిపి కార్పొరేటర్లు 'జె' ట్యాక్స్ పేరుతో విచ్చలవిడిగా డబ్బులు వసూలు చేయడమే గాకుండా, ఇవ్వని వారిని పనులు జరగనీకుండా అడ్డుకుంటున్నారు. తిరుపతి కార్పొరేషన్‌లో ఏ చిన్న పని జరగాలన్నా జె ట్యాక్స్ మామూళ్లు చెల్లించాల్సిందే.

దుర్వినియోగంపై విచారిస్తాం : నరసింహయాదవ్

తిరుపతి (మంగళం) : టిటిడి నిధులను, ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిన తీరుపై చట్టబద్ధంగానూ, న్యాయబద్ధంగానూ విచారించి వాస్తవాలను వెలుగులోకి తెస్తామని టిడిపి తిరుపతి పార్లమెంట్ అధ్యక్షులు నరసింహయాదవ్ స్పష్టం చేశారు. బుధవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఐదేళ్లుగా శ్రీవారి హుండీని దోచుకోవడం వల్లనే వైసిపి చెత్తగా ఓడిపోయిందన్నారు. జగన్ సర్పంచుల వ్యవస్థలను నిర్వీర్యం చేశారన్నారుర. టిటిడి నిధులు, టిడిఆర్ బాండ్ల వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపిస్తానన్నారు. శ్రీవాణి ట్రస్టు నిధులు ఏ విధంగా గల్లంతయ్యాయో, ప్రభుత్వానికి చేరాయో కూడా అంతు చూస్తామన్నారు.

ధర్మారెడ్డి పాపాలే జగన్‌కు శాపాలు : నవీన్ కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

తిరుమలలో ఈవో ధర్మారెడ్డి చేసిన పాపాలే జగన్‌కు శాపాలుగా మారి కోలుకో లేని ఓటమి దెబ్బ తీశాయని కాంగ్రెస్ నాయకుడు నవీన్ కుమార్ రెడ్డి ఆరోపించారు. బుధవారం తిరుపతి ప్రెస్ క్లబ్లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తిరుమల కేంద్రంగా శ్రీవారి సేవ టికెట్లను సినిమా టికెట్లుగా భావిస్తూ అమ్మేసి కోట్లు వెనకేశాడని ధర్మారెడ్డిపై తీవ్ర ఆరోపణలు చేశారు. రాష్ట్రంలో వైసిపి అధికారం కోల్పోయాక కూటమి అధికారంలోకి రావడంతో తాను చేసిన అక్రమాలు ఎక్కడ బయటపడతాయోనన్న భయంతో అమెరికాకు పోవడానికి ప్రయత్నిస్తున్నాడని, ఎట్టి పరిస్థితుల్లోనూ ధర్మారెడ్డి తిరుమల విడిచి పోకుండా అధికారులు తగిన ఆంక్షలు విధించాలని విజ్ఞప్తి చేశారు. ధర్మారెడ్డి జగన్ ప్రభుత్వానికి కొమ్ముగాస్తూ టీటీడీ నిధులను ఏ విధంగా దారి మళ్లించారో సిట్టింగ్ జడ్జితో విచారణ చేపడితే నిజాలు వెలుగులోకి వస్తాయన్నారు. సామాన్య భక్తులపైనా కేసు పెట్టిన ఘనత ధర్మారెడ్డికి చెల్లుబాటు అవుతుందన్నారు. ధర్మారెడ్డి చేసిన అక్రమాలలో కొంతమంది అర్చకులు, ఈవో కార్యాలయ సిబ్బంది ఆ పాపాల్లో భాగస్వామ్యులుగా ఉన్నారని, ఎవరినీ విడిచిపెట్టబోమని హెచ్చరించారు. టీటీడీకి సంబంధించిన ఫిక్స్ డ్ డిపాజిట్లు జాతీయ బ్యాంకులు నుండి ప్రైవేటు బ్యాంకులకు ఎలా మారయో అన్నీ బయటకు తీస్తామన్నారు. ధర్మారెడ్డి 30 వేలకు సేవా టికెట్లను అమ్ముకునే స్థాయికి దిగజారి పోయాడని అన్నారు. ఈ విలేకరుల సమావేశంలో హరిప్రసాద్, లోకేష్, జీవన్, త్రిలోక్ కుమార్, తనూజ్ పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల ప్రవేశానికి దరఖాస్తులు

ప్రజాశక్తి-సదుం: మహాత్మా జ్యోతీ బాపులే బిసి సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 6, 7, 8, 9 తరగతులలో ఇంగ్లీష్ మీడియంలో (బాలురు, బాలికలు) బ్యాక్ లాగ్ సీట్లకు ప్రవేశాలకు కొరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సదుం బిసి గురుకుల ప్రిన్సిపాల్ అండ్ కన్వీనర్ వి.శ్రీనివాసులు రెడ్డి అన్నారు. సదుం గురుకుల-(బాలురు), పులిచెర్ల-(బాలికలు), పెద్ద పంజాణి-(బాలికలు), కుప్పం -(బాలురు) బిసి సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 6,7,8,9 తరగతులలో బ్యాక్ లాగ్ సీట్లు కొరకు అర్హులైన విద్యార్థిణీ, విద్యార్థులు ఈ నెల 5వ తేది నుంచి 15వ తేదీ లోపు https://mjpapbcwreis. apcfss. in వెబ్‌సైట్ ద్వారా ఆన్లైన్లో దరఖాస్తులు చేసుకోవాలని ఆయన బుధవారం ఒక ప్రకటనలో విలేకరులకు తెలిపారు. వివరాలకు సదుం-9000317307, పులిచెర్ల-7416281148, పెద్ద పంజాణి-9515764818, కుప్పం -7680985 898 నెంబర్లుకు ఫోన్ చేసి వివరాలు తెలుసుకొని దరఖాస్తులు చేసుకోవాలని ఆయన కోరారు.

చంద్రబాబును కలిసిన నేతలు



ప్రజాశక్తి-చిత్తూరుడెస్క్: సార్వత్రిక ఎన్నికల ఫలితాలలో తెలుగుదేశం పార్టీ విజయం సాధించడం పట్ల బుధవారం అమరావతిలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు చంద్రబాబు నాయుడు మంగళగిరి ఎమ్మెల్యే నారా లోకేష్‌ను జిఆర్ కన్స్ట్రక్షన్స్ అధినేత ఈశ్వర్ నాయుడు కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికను తయారుచేసి పాలన చేపట్టనున్నట్టు ఆయన తెలిపారని చెప్పారు. ఈయన వెంట మండలానికి చెందిన కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

సిడి కండ్రిగ పంచాయతీలో టీడీపీకే మెజారిటీ

ప్రజాశక్తి-కార్వేటినగరం: మండల పరిధిలోని సిడి కండిగ పంచాయతీ పరిధిలోని సిడి కండిగా, కోదండ రామాపురం, కోదండరాంపురం దళితవాడలో కలిపి రెండు బూతులలో టిడిపి పార్టీకి దాదాపుగా 402ఓట్లు మెజార్టీ వచ్చిందని టిడిపి బూత్ కన్వీనర్ దాసరి గణేష్, ఏ.కుప్పారెడ్డి పేర్కొన్నారు. వారు విలేకరులతో మాట్లాడుతూ పంచాయతీ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఎమ్మెల్యేగా డాక్టర్ థామస్ విజయంపై సంతోషం వ్యక్తం చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు ఈనెల 9న ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయు సందర్భంగా వారికి శుభాకాంక్షలు తెలిపారు. వైసిపి పార్టీకి మెజారిటీ వస్తున్న రెండు బూతులలో టిడిపికి మెజార్టీ రావడం సంతోషదాయకమన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు ఏ.కుప్పారెడ్డి, గునిరెడ్డి, వరాల రెడ్డి, బాలకృష్ణారెడ్డి, చంద్రయ్య, నడిపి రెడ్డి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలు బడిలోనే ఉండాలి

ప్రజాశక్తి-చిత్తూరుడెస్క్: బడిఈడు పిల్లలు బడిలోనే ఉండాలని ఎంఈవో శ్రీదేవి, నమశ్శివాయంలు అన్నారు. బుధవారం నగరి పట్టణంలో బాల కార్మికుల నిర్మూలనపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. పట్టణంలో గల స్వీట్ షాపులు, బట్టల షాపులు, పూల మార్కెట్లో గల షాపులను సందర్శించి షాప్‌లో యజమానులకు బాల కార్మికులను పనిలో ఉంచరాదని, బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి నమశ్శివాయం, సిఆర్‌పిలు, పార్ట్ టైం ఇన్స్పెక్టర్లు, ఎంఆర్‌సి సిబ్బంది, పుత్తూరు, చిత్తూరు చైల్డ్ లేబర్ అధికారులు కె.హేమాచారి, జగదీష్, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 అధికారి ఎన్.అరుణ, డీసీపీయూ పి.మురళి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తకు నివాళి

ప్రజాశక్తి-రామకుప్పం: మండలంలోని పంద్యాలమడుగు పంచాయతీ, పల్లికుప్పం గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్త బాటప్ప అనారోగ్యంతో మృతి చెందారు. బుధవారం ఆయన భౌతికకాయానికి టీడీపి నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ తరఫున రూ.15వేల వారి కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేశారు. మృతుడి కుటుంబానికి టీడీపీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. కార్యక్రమంలో యువత అధ్యక్షుడు విశ్వనాథ్, చంద్రశేఖర్ రెడ్డి, గంట్లప్ప గౌడ్, అప్పాల, ప్రసాద్, సురేష్, నవీన్, బాలాజీ, నాగరాజు, మురుగేశ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే భానుకు ఘన స్వాగతం

ప్రజాశక్తి-చిత్తూరుడెస్క్: నగరి ప్రజల ఆశీస్సులతో భారీ మెజారిటీతో గెలుపొందిన నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్‌కి నగరి పట్టణ, రూరల్ ప్రజలు, తెలుగుదేశం, జనసేన, బీజేపీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యేగా అఖండ మెజారిటీ గెలుపొందిన సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు.

నల్లారికి అభినందనలు తెలిపిన పుంగనూరు టిడిపి నేతలు

గజమాలతో సన్మానిస్తున్న పుంగనూరు టిడిపి నేతలు

ప్రజాశక్తి-పుంగనూరు: తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, పీలేరు నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి అత్యధిక మెజారిటీతో గెలుపొందడంతో పుంగనూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులు కలసి ఆయనకు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. కలికిరి మండలంలోని నగిరిపల్లిలో నల్లారి కిషోర్‌కుమార్ రెడ్డి స్వగ్రామానికి వెళ్లి పుంగనూరు నాయకులు బుధవారం గజమాలతో సన్మానించారు. పుంగనూరు నుంచి వెళ్లిన పలువురు నాయకులు నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి మర్యాద పూర్వకంగా కలసి దుశ్శాలువలతో సన్మానించారు. త్వరలో జరుగు మంత్రి వర్గ విస్తరణలో కూడా మంత్రి పదవి రావాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. సన్మాన కార్యక్రమాన్ని రాష్ట్ర తెలుగు రైతు అధికార ప్రతినిధి సోమల సురేష్, రాజంపేట పార్లమెంట్ ఉపాధ్యక్షులు ఆసూరి బాలాజీ ఆధ్వర్యంలో పుంగనూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులు నిర్వహించారు. కార్యక్రమంలో సీవీ శ్రీనివాసులు, చిన్న రాయల్, సీవీ రెడ్డి రాయల్, శశిధర్, సోమల సద్దాం, రమేష్, అల్తాఫ్, నూరుల్లా, గంగిరెడ్డి, అజీజ్, నాగరాజ పాల్గొన్నారు.

అమర్నాథ్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపిన నేతలు

ప్రజాశక్తి - బైరెడ్డిపల్లి: సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించిన టీడీపీ పలమనేరు ఎమ్మెల్యే అభ్యర్థి అమర్నాథ్ రెడ్డికి బుధవారం బైరెడ్డిపల్లి నేతలు శుభాకాంక్షలు తెలిపారు. మండలంలోని టిడిపి పార్టీ అధ్యక్షులు కిషోర్ గౌడ, నెల్లిపట్ల పంచాయతీ టీడీపీ అధ్యక్షులు రమేష్ రెడ్డి, గంగప్ప, లోకనాథ రెడ్డి, జికె నాయుడు, దేవదొడ్డి సర్పంచ్ ముంతాజ్, అమీర్ బాషాలు మర్యాదపూర్వకంగా కలిసి కండువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు.

పలమనేరులో టీడీపీ కార్యాలయంలో నేతల సందడి

ప్రజాశక్తి - పలమనేరు: పలమనేరు ఎమ్మెల్యేగా టీడీపీ అభ్యర్థి ఎన్. అమరనాథ్‌రెడ్డి ఘన విజయం సాధించడంతో ఆ పార్టీ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. బుధవారం పలమనేరు పార్టీ కార్యాలయంలో అమరనాథ్‌రెడ్డిని కలవడానికి అభిమానులు ఉత్సాహం చూపారు. గజమాలతో సత్కరించి, ఘనంగా సత్కరించారు. అమరనాథ్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు.

నేత్రపర్వంగా రథోత్సవం



ప్రజాశక్తి-కార్వేటినగరం: కార్వేటినగరంలో వెలసి ఉన్న శ్రీవేణుగోపాలస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా 8వ రోజు బుధవారం రథోత్సవం కనుల పండువగా సాగింది. స్వామివారు రుక్మిణీ, సత్యభామ సమేతుడై దివ్య రథంపై విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. తెల్లవారు జామను స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలి వైఖానస ఆగమోక్తంగా నిత్యకైంకర్యాలను నిర్వహించారు. తోమాల, అర్చన, కొలువు, పంచాంగ శ్రవణం, సహస్రనామార్చన, శాత్తుమొర చేపట్టారు. 9గంటలకు రుక్మిణీ సత్యభామ సమేత శ్రీవేణుగోపాలుడుని పట్టు పీతాంబరాలు, మరకత మాణిక్యాలు, వజ్రవైఢ్యూరాలతో శోభాయమానంగా అలంకరించి రథంపై అధిష్టింపజేశారు. ఆశేష భక్తజనుల గోవిందనామస్మరణల మధ్య స్వామి, అమ్మవార్లు రథంపై నగరవీధుల్లో విహరించారు. రథంపై విహరించే మాధవుడిని దర్శిస్తే పునర్జన్మ ఉండదని పురాణాలు చెబుతున్నాయి. దీంతో భక్తులు పెద్ద ఎత్తున విచ్చేసి రథంపై మిరియాలతో కూడిన ఉప్పును చల్లుతూ స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. భజన బృందాలు, కోలాటప్రదర్శనలు, చెక్కభజనలు, మంగళవాయిద్యాల నడుమ రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. సాయంత్రం 6.30గంటలకు ఆలయ ఆవరణంలో ఉన్న ఊంజల్ మండపానికి చేరుకున్న స్వామి వార్లు ఊంజల్ సేవలో సేద తీరారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి వీక్షించి తన్మయత్వం చెందారు.

- అశ్వవాహనంపై వేణుగోపాలుడు రాజసం రాత్రి స్వామివారు అశ్వవాహనంపై నగరవీధుల్లో విహరించారు. అడుగడుగునా భక్తులు కర్పూర హారతులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏఈవో పార్థసారథి, సూపరింటెండెంట్ సోమశేఖర్, ఆలయాధికారి సురేష్‌కుమార్, షరాబ్ బాబుసురేష్, కంకణభట్టర్ నారాయణం దాసరి, వేదపండితులు గోపాలాచారి, తరుణ్‌కుమార్, రమేష్ స్వామి, అలంకార భటులు, టీటీడీ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు చక్రస్నానం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రధాన ఘట్టమైన చక్రస్నానం గురువారం ఉదయం 9గంటలకు రాజరాజేశ్వరీదేవి ఆలయ సమీపంలో ఉన్న స్కంధపుష్కరిణిలో చక్రస్నానం నిర్వహించనున్నట్లు ఆలయ అధికారి సురేష్‌కుమార్ తెలిపారు. అలాగే ఉదయం 6 గంటల నుంచి 7వరకు పల్లకి ఉత్సవం 7.30 గంటల నుంచి 8.30 వరకు పుష్కరిణీ వద్ద ఉభయ నాంచారులతో పాటు స్వామివారికి స్నపన తిరుమంజనం జరగనుంది. సాయంత్రం 5.30 గంటల నుంచి 7గంటల నడుమ ధ్వజావరోహణం కార్యక్రమం జరగనుంది. దీంతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి.

ప్రతి ఇంటికీ చెట్టు.. ఊరికి ఒక వనం

గ్రేడ్స్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు శేషాద్రి

ప్రజాశక్తి-చిత్తూరుడెస్క్: ప్రతి ఇంటికీ చెట్టు ఊరికి ఒక వనముగా తయారవుతుందని గ్రేడ్స్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు డాక్టర్ శేషాద్రి అన్నారు. అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం సందర్భంగా బుధవారం బంగారుపాళ్యం మండలం తగ్గువారిపల్లి పంచాయతీ అండారెడ్డిపల్లెలో గ్రేడ్స్ సంస్థ అధ్యక్షులు శేషాద్రి మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వర్షాలు, గాలి రావాలన్న మొక్కలు ప్రతి ఒక్కరు ఇంటి ఆవరణలో నటాలని ఇంటింటా చెట్టు ప్రగతికి మెట్టు అన్నారు. పర్యావరణాన్ని కాలుష్యం నుంచి రక్షించేందుకు చెట్లు ఎంతో దోహదపడతాయని కార్బన్డయాక్సైడ్‌ని పీల్చుకుని ఆక్సిజన్ విడుదల చేసి మానవుల మనుగడకు ఎంతో ఉపయోగపడతాయన్నారు. అందువల్ల చెట్లు నాటాలన్నారు. కార్యక్రమంలో గ్రేడ్స్ సంస్థ ఆర్గనైజర్ మానస్, మహిళా మండలి సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సోమలలో

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

- ప్రధానోపాధ్యాయురాలు కుసుమాంబ

ప్రజాశక్తి-సోమల: పర్యావరణాన్ని పరిరక్షించడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యతని నంజంపేట జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కుసుమాంబ అన్నారు. బుధవారం పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయ బృందం ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రతి ఒక్కరూ మొక్కలను పెంచడం నీటిని పొదుపుగా వాడడం ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా తగ్గించడం చేయడం వల్ల ఓజోన్ పొర దెబ్బ తినకుండా పర్యావరణాన్ని పరిరక్షించిన వాళ్ళ అవుతామని అన్నారు. అనంతరం విద్యార్థులు ఉపాధ్యాయ బృందం ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జగన్మోహన్ రెడ్డి, మోహన్ రెడ్డి, రాజేష్ ప్రసాద్ గాయత్రి స్వాతి కమల నూర్జహాన్ సుబ్రమణ్యం, కిరణ్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం

సదుంలో

ప్రజాశక్తి-సదుం: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మండలంలోని జోగివారిపల్లికి చెందిన ఒక ప్రైవేట్ పాఠశాల ఉపాధ్యాయుడు, సామాజిక కార్యకర్త రొడ్డా రమేష్ తన గ్రామంలో మొక్కలు నాటి ప్రపంచ పర్యావరణంపై స్కూల్ విద్యార్థులకు, గ్రామస్తులకు బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్లాస్టిక్ వ్యర్థాలను భూమిపై ఎక్కడ పడితే అక్కడ వేయకూడదని, పర్యావరణం కాపాడేందుకు, కాలుష్యం లేని వాతావరణం వుండే విధంగా మొక్కలు నాటాలని ఆయన గ్రామస్తులకు, విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జోగివారిపల్లి గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పర్యావరణ రక్షణపై అవగాహన

ప్రజాశక్తి-చిత్తూరుడెస్క్: పర్యావరణ రక్షణపై విద్యార్థులకు ఎంఈవో శ్రీదేవి అవగాహన కల్పించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని నగరి మున్సిపల్ పరిధిలోని చింతలపట్టెడ, వినాయకపురం జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆమె మొక్కలను నాటారు. మొక్కలు నాటడం వల్ల కలిగే ప్రయోజనాలను విశదీకరించారు. పర్యావరణ పరిరక్షణకు తీసుకోవలసిన చర్యలను, దాని ఆవశ్యకతలను తెలియజేశారు. ప్లాస్టిక్ వాడకం వలన కలిగే అనర్థాలను వివరించారు. పిల్లలకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. పర్యావరణానికి సంబంధిత వివిధ నానాధాలతోగల ప్లకార్డులతో పిల్లలతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎంఈవో నమశ్శివాయం, పాఠశాల ఉపాధ్యాయులు కె.బాబు, మీరయ్య తదితరులు పాల్గొన్నారు.

మనోహర్ నాయుడు లేని లోటు ఎవరూ తీర్చలేరు

✦ గంగాధర నెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ థామస్

పాచిగుంటలో నివాళులర్పించిన ఎమ్మెల్యే డాక్టర్ థామస్

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: రాష్ట్ర రైతు నాయకులు మనోహర్ నాయుడు లేని లోటు ఎవరూ తీర్చలేరని టీడీపీ జీడీ నెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ థామస్ అన్నారు. ఎన్నికల్లో విజయం సాధించిన తర్వాత పాచిగుంటలో మనోహర్ నాయుడు సమాధిని సందర్శించి నివాళు లర్పించారు. చెన్నైలో డాక్టర్ వృత్తిలో ఉన్న తనను చంద్రబాబు నాయుడు వద్దకు తీసుకెళ్లి తనకు రాజకీయ రంగ ప్రవేశం చేయించింది ఆయనే అన్నారు. ఆయన ఆశయాలు సిద్ధాంతాల కోసం కృషి చేస్తానని అన్నారు. థామస్‌తో పాటు ఆయన సతీమణి శాంతి, సోదరుడు నీది, జనసేన ఇన్‌ఛార్జ్ యుగంధర్, మండల పార్టీ అధ్యక్షులు స్వామి దాస్, పాచిగుంట శిల్ప, రఘునాథ నాయుడు, కేశవులు నాయుడుతో పాటు పలువురు టిడిపి నేతలు పాల్గొని మనోహర్ నాయుడు సమాధికి నివాళులర్పించారు.

కాంగ్రెస్ పార్టీ పుంజుకుంటోంది: సజ్జద్ బాషా

ప్రజాశక్తి-పుంగనూరు: ఇండియా కూటమిలో భాగమైన కాంగ్రెస్ పార్టీ 2024ఎన్నికల్లో పుంజుకున్నదని జిల్లా ప్రియాంక సేవాదళ్ అధ్యక్షుడు ఎస్.సజ్జద్ బాషా బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. రాహుల్ ప్రియాంక గాంధీ నాయకత్వంలో 52స్థానాల నుంచి 100స్థానాలు సాధించిన కాంగ్రెస్‌పార్టీకి అభినందనలు చెప్పారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలు సమాజం ఆమోదించని పనులు చేసిన వైసిపి ప్రభుత్వానికి ప్రజలు గట్టిగా బుద్ధి చెప్పారన్నారు. ముఖ్యమంత్రిగా ప్రమాణం చేస్తున్న చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలో రౌడీయిజాన్ని అంతం చేయాలని, రాష్ట్ర భవిష్యత్తు చంద్రబాబు నాయుడు నాయకత్వంలో అభివృద్ధి సాధిస్తుంది అని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఎన్‌డీఏలో భాగస్వామ్యం ఉన్న ఏపీకి తిరిగి రాజధాని అమరావతి, పోలవరం పనులు, మెట్రో రైలు ప్రత్యేకంగా సాధించాలి, ప్రజల ఆకాంక్ష నెరవేర్చుతారని ప్రజల పూర్తిస్థాయి నమ్మకంతో ఉన్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు షర్మిల ప్రజలను పూర్తిస్థాయిలో ప్రతిబింబచూపలేక పోయిందని పార్టీని ప్రజలు ఆదరించలేకపోయారని ఆవేదన వ్యక్తం చేశారు.

అంబేద్కర్‌కు ఘన నివాళి

ప్రజాశక్తి-చిత్తూరుడెస్క్: సార్వత్రిక ఎన్నికల్లో పూతలపట్టు నియోజకవర్గ ఎమ్మెల్యేగా ఎన్నికైన డాక్టర్ కలికిరి మురళిమోహన్ బంగారుపాళ్యంకి మొట్టమొదటిసారిగా రావడం పట్ల కార్యకర్తలు, అభిమానులు ఘనంగా స్వాగతం పలికారు. తొలతగా ఆయన అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు జయప్రకాష నాయుడు, మండల ప్రధాన కార్యదర్శి జనార్దన్ గౌడ్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

టీడీపీ విజయంపై నేతల సంబరాలు

కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకుంటున్న తమ్ముళ్లు

ప్రజాశక్తి-కార్వేటినగరం: జీడి నెల్లూరు ఎమ్మెల్యేగా డాక్టర్ థామస్ విజయం సాధించడంతో కార్వేటినగరంలోని తెలుగుతమ్ముళ్లు బుధవారం స్థానిక బంగారమ్మ ఆలయం వద్ద 101కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. జాతీయ టిడిపి అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు, డాక్టర్ థామస్ జిందాబాద్ అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో నాయకులు తిరుమల నాథ్, వాసుదేవ రెడ్డి నటరాజు, రవి యాదవ్, జగన్నాథం, ప్రసాద్, గురువర్మ, పార్థసారథి, పద్మనాభం, జనసేన నాయకులు జ్యోతి, బిజెపి పార్టీ మండల అధ్యక్షులు రాజశేఖర్ పాల్గొన్నారు.

మొక్కులు తీర్చుకున్న నాని కుటుంబ సభ్యులు



ప్రజాశక్తి -రామచంద్రాపురం: చంద్రగిరి ఎంఎల్ఏ పులివర్తి నాని కుటుంబ సమేతంగా తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. బుధవారం ఉదయం వేద పండితులు మంత్రోచ్చారణతో పులివర్తి నాని కుటుంబ సభ్యులను ఆశీర్వదించారు. అనంతరం సూర్యనారాయణ స్వామి ని దర్శించుకున్నారు. ప్రజలు సుఖ సంతోషాలతో జీవించాలని అమ్మవారిని ప్రార్థించినట్లు పులివర్తి నాని తెలిపారు. ఈ కార్యక్రమంలో సుధా రెడ్డి, పులివర్తి వినిల్, నాయకులు పాల్గొన్నారు.

జనం భయంతో ఓటేశారు: కిరణ్ రాయల్

తిరుపతి(మంగళం): సాధారణంగా ప్రజలు ఆశతో, కోపంతో ఓట్లు వేయడం చూసామని, కానీ ఈసారి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో జనం భయంతో ఓటేయడం చూసామని జనసేన తిరుపతి అసెంబ్లీ బాధ్యులు కిరణ్ రాయల్ అన్నారు. బుధవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో మాట్లాడుతూ 96 గంటలకు ముందు అధికారంలోకి వచ్చి మాట్లాడ తానని తాను చేసిన శబధాన్ని గుర్తు చేశారు. రాష్ట్రాన్ని కాపాడడానికి పవన్ కళ్యాణ్ ఒక బాహుబలిగా వచ్చాడని అభివర్ణించారు. తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుకు వచ్చిన మెజారిటీ చరిత్రలో నిలిచిపోతుందన్నారు. జగన్ నాలుగో తేదీ ప్రపంచమంతా ఆశ్చర్య పోయే ఫలితాలు వెలువడతాయని చెప్పారని, ఆ ఫలితాలు కూటమిది అని తరువాత తెలిసి వచ్చిందన్నారు. మాజీ ఎమ్మెల్యేలు భూమన కరుణాకర్ రెడ్డి, ఆర్కే రోజా టీటీడీ నిధులు 20 కోట్ల మేర బొక్కేసారన్నారు. ఈ విలేకరుల సమావేశంలో జనసేన నాయకురాలు ఆకేపాటీ సుభాషిని, సుమన్, సాయి, మునస్వామి పాల్గొన్నారు.

భర్త వేధింపులకు భార్య ఆత్మహత్య

ప్రజాశక్తి-పుంగనూరు: భర్త వేధింపులు భరించలేక భార్య బుధవారం వేకువజామున ఇంటి సమీపంలో ఉన్న చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుని మృతి చెందిన ఘటన పుంగనూరు మండలం నెక్కుంది గ్రామంలో చోటు చేసుకుంది. సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. పెద్దపంజాణి మండలం పోలేపల్లి గ్రామానికి చెందిన నరసింహులు, భాగ్యమ్మ కుమార్తె త్రివేణి(28) 6నెలల క్రితం పుంగనూరు మండలం నేక్కుంది గ్రామానికి చెందిన కృష్ణప్ప కుమారుడు నరేష్‌కు వివాహం చేయడం జరిగింది. నరేష్ బెంగళూరులోని కళామందిర్ లోపనిచేస్తున్నాడు. అక్కడ వీరి కుటుంబం ఏదో గొడవలు జరిగాయని నరేష్ భార్య త్రివేణి తీసుకుని వారి స్వగ్రామైన పోలేపల్లికి వెళ్లి తల్లిదండ్రులకు చెప్పి అక్కడ వదిలి వెళ్లడం జరిగింది. వెళుతూ వెళుతూ నేను కూడా బతకనని చనిపోతానని ఉత్తరం రాసి అక్కడ పెట్టి వెళ్ళాడు. దీంతో ఆందోళన చెందిన త్రివేణి, తల్లిదండ్రులు ఆమెను తీసుకొని నెక్కుంది గ్రామానికి వెళ్లి నరేష్ ఎక్కడ ఉన్నాడని విచారించారు. దీంతో వారి తల్లిదండ్రులు ఫోన్ చేసి విచారించగా బెంగళూరులోనే క్షేమంగా ఉన్నాను వస్తానని వారికి చెప్పారు. త్రివేణి తల్లిదండ్రులు మంగళవారం రాత్రి అక్కడే ఉండగా మనస్థాపానికి గురైన ఆమె బుధవారం వేకువజామున లేచి దగ్గర్లో ఉన్న ఓ చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుని మృతి చెందింది. సంఘటనపై పోలీస్‌లకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు.